క్లుప్తంగా

'స్వచ్ఛ ఆర్మూర్'



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలో 'మహాత్మా స్వచ్ఛంద సంస్థ' ఆధ్వర్యంలో ఆర్టీవో టెస్టింగ్ సెంటర్ గ్రౌండ్ ఆవరణలో స్వచ్ఛ ఆర్మూర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ..ప్రతి ఆదివారం 'ఒక గంట – స్వచ్ఛార్మూర్ కోసం' అనే నినాదంతో శుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆర్టీవో టెస్టింగ్ సెంటర్ గ్రౌండ్ సిబ్బంది సహకారంతో ఆవరణంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, కాలనీవాసులు, పాల్గొన్నారు.

ఆలయాల్లో కాగడ హారతి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో, నర్సింహాస్వామి ఆలయంలో, శ్రీరాజరాజేశ్వర ఆలయంలో భక్తులు ఆదివారం ఉదయం భక్తిశ్రద్ధలతో కాగడ హారతి చేపడుతున్నారు. అనంతరం ఆలయ పూజారికి దీపదానం చేస్తున్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

'దేశాయి' దోపిడీని ఐక్యంగా ప్రతిఘటిద్దాం



ఆర్మూర్‌టౌన్: దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యం కార్మికులపై చేస్తున్న ఆర్థిక దోపిడీని ఐక్యంగా ప్రతిఘటిద్దామని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, బీడీ కార్మిక ఫెడరేషన్ అధ్యక్షుడు పోశెట్టి పిలుపునిచ్చారు. ఆర్మూర్‌లోని కుమార్ నారాయణ భవన్‌లో ఆదివారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీడీ కార్మికుల నుంచి ప్రతి వెయ్యి బీడీలకు దేశాయి యాజమాన్యం రూ.10 వసూలు చేస్తూ కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతోందన్నారు. కార్మికుల చేత తినుబండారాలు బలవంతంగా కొనుగోళ్లు చేయించడం సరికాదన్నారు. ఈకార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు, రామకృష్ణ, దేవారం, నూర్జహాన్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ శివారు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన కాంట్లె రాజు, కమ్మర్‌పల్లికి చెందిన బోదాసు రాజు లారీలో ఇసుకను నింపుకుని ఏర్గట్లవైపు వస్తుండగా లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసుకున్నామన్నారు.

ధ్యానంతో మానసిక శాంతి

ఆర్మూర్‌టౌన్: ప్రతిరోజు ధ్యానంతో మానసిక శాంతి చేకూరుతుందని ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణ ఆధ్వర్యంలో 108 రోజులు, 108 గ్రామాల్లో ధ్యానజ్ఞాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమ విజయోత్సవ సంబురాలను పట్టణంలోని నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ బింగి నరేందర్, తెలంగాణ కో ఆర్డినేటర్ వాల్గొట్, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి చేతులమీదుగా సాయికృష్ణ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ ఇంటర్నేషనల్ అవార్డు, గోల్డ్‌మెడల్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో విజయ్ భాస్కర్‌రెడ్డి, రాజేందర్, లక్ష్మి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న సాయికృష్ణ

జీపీ భవన నిర్మాణం ఎప్పుడు?

- నందిపేట మండలం జోర్‌పూర్‌లో మూడేళ్ల క్రితం శంకుస్థాపన
- రూ. 20 లక్షలు మంజూరు
- ఇప్పటికీ ప్రారంభం కాని పనులు



గుంతలు తీసి నిర్మాణ దశలో ఆగిపోయిన మల్లారం జీపీ భవనం



జోర్‌పూర్‌లో కొనసాగుతున్న జీపీ కార్యాలయం

నందిపేట్(ఆర్మూర్) : నందిపేట మండలంలోని జోర్‌పూర్ గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం 2022 సంవత్సరంలో రూ. 20 లక్షల నిధులను మంజూరు చేయడంతో పనులకు శంకుస్థాపనలు చేశారు. మూడేళ్లు గడుస్తున్నా పనుల్లో ఇప్పటి వరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. గత ప్రభుత్వంలో 2018 లో నూతన గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా జోర్‌పూర్ గ్రామం నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. అంతకు ముందు కుద్వాన్‌పూర్ గ్రామపంచాయతీలో అమ్లేట్ గ్రామంగా కొనసాగింది. గ్రామ పంచాయతీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలోని సంఘం భవనంలోనే కొనసాగుతుంది.

మల్లారంలో అదే పరిస్థితి

నందిపేట మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు కూడా ముందుకు సాగడం లేదు. ఈ భవనం కోసం సైతం గత ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేయడంతో రెండు నెలల క్రితం గుంతలు తీసి వదిలేశారు. మల్లారం గ్రామంలో సైతం సంఘ భవనంలో కొనసాగుతుంది. రెండు గదులే ఉండడంతో పాలనకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి జీపీ భవన నిర్మాణాలను ప్రారంభించి త్వరలో పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన అనంతరం కార్యకలాపాలు నిర్వహించే సంఘం భవనం ఇరుకుగా ఉండి పురాతనమైంది కావడంతో నూతన భవన నిర్మాణం కోసం నిధులను మంజూరు చేశారు. కాగా తక్కువ రేట్లతో పనులు మంజూరు కావడంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. పాలకులు స్పందించి నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ఇంకా ప్రారంభం కాలేదు. నిదులు ఇబ్బంది లేదు. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.
– రాజ్‌కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ, నందిపేట

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



జలాల్‌పూర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో లబ్ధిదారుతో సునీల్‌రెడ్డి

బాల్కొండ : పేద ప్రజలు ఆత్మ గౌరవంతో బ్రతకాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బాల్కొండ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. ఆదివారం బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న ఇరిగోల్ల లక్ష్మి అనే లబ్ధిదారు గృహ ప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారుతో కలిసి నూతన ఇంట్లోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ పార్టీ పేద వారికి కనీసం రేషన్ కార్డు కూడ ఇవ్వలేదన్నారు. కేవలం పార్టీ కార్యకర్తలకే డబుల్ బెడ్ రూం లు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలెం నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రబీకి రైతన్న సన్నద్ధం



వెల్కటూర్ తండాలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

బాల్కొండ: ప్రస్తుత సంవత్సరం విస్తారంగా వర్షాలు కురువడంతో రైతన్నకు అన్ని పంటలు సాగు చేయుటకు ధీమా లభించింది. దీంతో ప్రస్తుతం రబీ పంటలు సాగు చేయుటకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన సోయా, మొక్కజొన్నలు పంటలు చేతికందాయి. కోతలు పూర్తి చేసిన రైతులు ఇప్పుడు రబీ దుక్కులు దున్నడంలో బిజీ అయ్యారు. బాల్కొండ, మెండోరా, ముప్కాల్ మండలాల పరిధిలో వెయ్యి హెక్టార్లలో సోయా పంట, 2వేల హెక్టార్లలో మొక్క జొన్న పంటను ఖరీఫ్‌లో సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంటలు చేతికందడంతో ఆ నేలల్లో జొన్న పంటను , వేరు శనగ పంటను సాగు చేయుటకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

పచ్చి బుట్ట కోసం మొక్క జొన్న సాగు చేసిన నేలల్లో ఇది వరకే వేరు శనగ పంటను సాగు చేశారు. ఆ పంట కూడ ప్రస్తుతం మరో 20 రోజుల్లో చేతికందుతుందని రైతులు అంటున్నారు. ఆ నేలల్లో కూడ జొన్న, మొక్క జొన్న పంటను చివరగా సాగు చేస్తామని రైతులు అంటున్నారు. ఆర్మూర్ డివిజన్ ప్రాంతంలో అధికంగా ఎర్ర జొన్న పంటను రబీలో సాగు చేస్తారు. తక్కువ పెట్టుబడి, స్వల్పకాలిక పంట కావడం వలన అధికంగా సాగు చేయుటకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

'ఊర'ంతా పండుగ



రెంజల్(బోధన్): డప్పు చప్పుళ్లు..పోతరాజుల విన్యాసాలు..గ్రామదేవతలకు ప్రత్యేక పూజలతో రెంజల్ మండలం కళ్యాపూర్, సాటాపూర్ గ్రామాల్లో కోలాహలం ఏర్పడింది. గ్రామస్తులు ఆదివారం ఊర పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఊరంతా ఒక్కటై ఊరి దేవతలను కొలుచుకున్నారు. పాడిపంటలు చల్లంగా చూడాలని, గ్రామాల్లో శాంతిని కలిగించాలని కోరుకుంటూ గ్రామస్తులు ఊర పండగను నిర్వహిస్తారు. పక్క గ్రామాల నుంచి పోతరాజులను పిలిపించుకుని వారిచే గావు పట్టించడం ఆనవాయితి. మహాలక్ష్మీ ఆలయానికి ఊరంతా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ నిర్వహణకు పొయ్యికి కొంత జమ చేసి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పండుగను నిర్వహించారు. పండగలో గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పలు పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో పాత జాతీయ రహదారి 44 పై గత మూడేళ్లుగా మురుగు నీరు ప్రవహిస్తుంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. పక్కన మురికి కాలువలు నిర్మించడం మరిచి పోయారు. ఫలితంగా ఇళ్లలో నుంచి వచ్చే మురుగు కాలువల నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. సమస్య ఆర్‌అండ్‌బీ పరిధిలోనిది జీపీ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు జీపీ పరిధిలోనిది తెలుపుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. పాలకులు స్పందించి వెంటనే మురుగు కాలువను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రిమినల్ రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలి



బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ పట్టణ ప్రతినిధులు



ఆర్మూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

బోధన్ : సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన క్రిమినల్ రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేసి, ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోపికిషన్ ఆధ్వర్యంలో శక్కర్‌నగర్‌లో ఏసీపీ శ్రీనివాస్‌కు నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోపికిషన్ మాట్లాడుతూ నిజామాబాద్, బోధన్ పట్టణాల్లోని సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సర్చ్ నిర్వహించి రౌడీషీటర్లు, దొంగలు, ఉగ్రవాద చర్యలను నిలువరించేందుకు అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి రూ.2 కోట్ల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈఘటనలో గాయాలైన సీసీఎస్ ఎస్సై విఠల్‌ను ఆయన స్వగృహానికి వెళ్లి నాయకులు పరామర్శించారు. నాయకులు గొడుగు ధర్మపురి వినోద్, గుంత గంగాధర్, హన్మాండ్లు చారి, పవన్‌కుమార్, మిర్జాపురం అర్విందర్, ఎనుగంటి గౌతంగౌడ్, యేశాల సూరి పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో ఆదివారం రాత్రి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ప్రమోద్ మృతిపై కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. మామిడిపల్లి నుంచి అంబేద్కర్‌చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నర్మె నవీన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, రంజిత్, పృథ్వీరాజ్, యువకులు పాల్గొన్నారు.

రుద్రూర్: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ప్రమోద్‌కు ఆదివారం రాత్రి నివాళులు అర్పించారు. కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు హరికృష్ణ, వి. రామ్‌రాజ్, పార్వతి మురళి, ప్రశాంత్ గౌడ్, నవీన్, గాండ్ల మధు, తోట శంకర్, కెవి మోహన్, కొలస్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : కానిస్టేబుల్ ప్రమోద్‌ను దారుణంగా హతమార్చిన క్రిమినల్ రియాజ్ ను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి గౌతం ఆదివారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. మరో మారు ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



రుద్రూర్‌లో ..

చోరీకి గురవుతున్న ఇనుప పైపులు, చువ్వలు





పెద్ద వాగుపై తొర్లి గ్రామం వైపు ఎత్తుకెళ్లిన ఇనుప పైపులు, ఇనుప చువ్వలు

బాల్కొండ : ముప్కాల్ మండలం వెంచిర్యాల్ శివారులో పెద్ద వాగు పై నిర్మించిన అక్విడక్ట్‌పై గల ఇనుప పైపులను, చువ్వలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. కాకతీయ కాలువ నీటిని పెద్దవాగు దాటించుట కోసం పెద్ద వాగు పై అక్విడక్ట్‌కాలువ నిర్మాణం నిర్మించారు. అక్విడక్ట్‌కు ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో దుండగులు సిమెంట్ గోడలను తవ్వి ఇనుప చువ్వలు, పైపులు ఎత్తుకెళ్తున్నారు. సిమెంట్ గోడలను తవ్వడంతో నీటి లీకేజీలు ఏర్పడుతున్నాయి. అక్విడక్ట్ శిథిలమవుతున్నా అధికారులు ఇప్పటికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇనుప పైపులు, చువ్వలు చోరీకి గురి కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



కమ్మర్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

కమ్మర్‌పల్లి: సోయాబీన్, మక్కల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ రైతులు కమ్మర్‌పల్లిలోని జాతీయ రహదారిపై ఆదివారం రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తగిన సదుపాయాలు కల్పించకపోవడంతో కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. సోయా కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించలేదన్నారు. వడ్లకు బోనస్ విడుదల చేయాలన్నారు. అరగంట పాటు సాగిన రాస్తారోకోతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచి పోయాయి. పోలీసులు జోక్యం చేసుకొని రైతులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు.

బీఆర్ఎస్‌లో చేరిక

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో మాలిక్ బాబా, మాజీ కోఆప్షన్ సభ్యుడు అజీమ్, మర్కజ్ కమిటీ ప్రెసిడెంట్ ఖలీం, జాహీద్ తదితరులున్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

సౌకర్యాలు లేక ఇబ్బందులు

- ఆర్మూర్‌లోని మినీ స్టేడియంలో మౌలిక వసతుల కొరత
- అత్యవసరానికి ఇంటికి వెళ్లాల్సిందే
- పట్టించుకోని అధికారులు



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని మినిస్టేడియం (జావిద్‌బాయ్ స్టేడియం) క్రీడలకే గాక ప్రజా వినోదానికి కూడా ప్రధాన కేంద్రంగా మారింది. స్టేడియంలో మౌలిక వసతులు లేకపోవడం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ స్టేడియంలో మండలస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు పోటీలు జరుగుతాయి. ఒకప్పుడు ఈ గ్రౌండ్ నుంచి ఎంతోమంది క్రీడకారులు జాతీయస్థాయిలో రాణించారు. జాతీయస్థాయి క్రీడలు నిర్వహించే స్థాయికి ఎదిగిన ఈ స్టేడియంలో మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు అందుబాటులో లేని పరిస్థితి ఉంది. ప్రతిరోజూ వందలాది మంది ఉదయాన్నే వాకింగ్ చేయడానికి, యువకులు, చిన్నారులు ఆటల కోసం ఈ ప్రాంగణానికి వస్తుంటారు. సదుపాయాలు లేకపోవడంతో అత్యవసర సందర్భాల్లో తీవ్ర అసౌకర్యాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం మినిస్టేడియంను పట్టించుకునే వారు కరువయ్యారు. సంబంధింత అధికారులు స్టేడియంలో తాగునీరు, మౌలిక వసతులు, క్రీడాకారులు ఉండేందుకు గదులు మరమ్మతులు చేయడంపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

రాత్రి అయితే చాలు గ్రౌండ్ గోడ దూకి వస్తున్నారు. మందు బాబులు మద్యం సేవించి మందు సీసాలను పగలగొడుతున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో ఉదయం వచ్చే వాకర్స్, క్రీడాకారులకు గాయాలవుతున్నాయి.

తాగునీటి సౌకర్యం లేదు

పట్టణంలో పెద్ద స్టేడియం ఉండి కూడా తాగునీటి, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం విచారకరం. అత్యవసరం వస్తే తిరిగి ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. స్టేడియం జాతీయ స్థాయి పోటీలకు వేదిక అయినా, సదుపాయాలు సరిగా లేవు. అధికారులు చర్యలు తీసుకోవాలి. – రాజు, వాకర్,ఆర్మూర్

మరుగుదొడ్లు లేవు

ప్రతి రోజు సాయంత్రం వాకింగ్, ఆటల కోసం వస్తాం. మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చిన్నారులతో రావడం కష్టమవుతుంది. మహిళలకు ప్రత్యేక సదుపాయాలు ఉండాలి. మరింత మంది గ్రౌండ్‌కు వస్తారు. సరిత, వాకర్, ఆర్మూర్



ధ్వంసమైన గదుల తలుపులు